నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

10 | నిజామాబాద్ శనివారం 5 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL



నిమ్మరసం అందించి దీక్ష విరమింపజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# సీసీఐ కోసం పోరాడుతాం

## మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

- పరిశ్రమపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి
- రిలే నిరాహార దీక్ష విరమించిన సాధన కమిటీ సభ్యులు

ఎదులాపురం,ఏప్రిల్4: సీసీఐ పరిశ్రమ పునః ప్రారంభమైతే జిల్లా ముఖ చిత్రం మారనుందని, ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఎన్ని పోరాటాలైనా చేస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ పునరుద్ధరనే ధ్యేయంగా ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ వద్ద 17 రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు గురువారం మాజీ మంత్రి జోగు రామన్న నేతృత్వంలో సమితి సభ్యులు ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫ్యాక్టరీ ఆవశ్యకతను వివరించారు. వెంటనే సీసీఐని పునః ప్రారంభించాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్‌లో శుక్రవారం దీక్షల్లో పాల్గొన్న సాధన కమిటీ నాయకులు, సభ్యులకు జోగురామన్న నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న మాట్లాడుతూ...సీసీఐ పునః ప్రారంభానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక మార్లు కేంద్ర మంత్రులను కలిశామని, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేనప్పటికీ అన్ని విధాలా తమ వంతు సహకారం అందిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. వందేళ్లకు సరిపడా ముడిసరుకు కలిగిన ఫ్యాక్టరీ ప్రారంభమైతే జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తుందని, స్థానికులకు ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. ఈ విషయమై సాధన సమితి సభ్యులతో కలిసి ఢిల్లీకి వెళ్లామని తెలిపారు. ఎంపీ గోడం నగేశ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా..అహంకారపూరితంగా సమాధానాలివ్వడం సరికాదన్నారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కలిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ ఆవశ్యకతను వివరిస్తే అయన సానుకూలంగా స్పందించి..ఆరు నెలల్లో ఫ్యాక్టరీ పునరుద్ధరణపై స్పష్టత ఇస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఆదిలాబాద్ భవిష్యత్‌ను రియల్ ఎస్టేట్‌గా మార్చుకుంటున్నారని ఆరోపించారు. సీసీఐ సాధన కమిటీ ద్వారా చేపట్టిన ఉద్యమాలను కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్, కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీసీఐ కమిటీ సభ్యులు విజ్జగిరి నారాయణ టింగని పోశెట్టి, గుడిపెల్లి నగేశ్, కొండ రమేశ్, బొల్లు ఈశ్వర్, ఎస్.అరుణ్ కుమార్,ఉజిగిరి విఠల్ , వెంకట నారయణ,బమాన్ జగన్, బొజ్జ ఆశన్న, దర్శనాల నగేశ్ సిర్ర దేవేందర్ తదితరులు పాల్గొన్నారు,

### కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి

బేల, ఏప్రిల్ 4 : ఆదిలాబాద్‌లో మూతపడ్డ సిమెంట్ పరిశ్రమ(సీసీఐ)ను పునరుద్ధరించేందుకు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆదిలాబాద్ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రౌత్ మనోహర్ డిమాండ్ చేశారు. సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు బేల మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని నినాదాలు చేశారు. సీసీఐ పునఃప్రారంభించడంతో జిల్లాకు చెందిన వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బేల మండల అధ్యక్షుడు కళ్యాం ప్రమోద్ రెడ్డి, నాయకులు సతీశ్ పవర్, గంభీర్ ఠాక్రే, మాస్కే తేజిరావ్, విఠల్ వరాడే, తాన్ బా ఠాక్రే, విపిన్ ఖోడే, విశాల్ పాల్గొన్నారు.



సీసీఐ దీక్షలో కూర్చున్న బేల మండల బీఆర్ఎస్ నాయకులు



నేరడిగొండ : నేలకొరిగిన జొన్న చేనును చూపిస్తున్న రైతు వెంకటరమణ



తాంసి : వడ్డాడిలో అకాల వర్షానికి నేల కొరిగిన జొన్న పంట

# ముంచిన వాన

- కల్లాల్లో తడిసిన ధాన్యం కుప్పలు
- చేతికందిన పంటలు నేలపాలు
- కంటతడి పెడుతున్న రైతులు
- ఆదుకోవాలని వేడుకోలు

## నేలకొరిగిన జొన్న, మక్క, నువ్వుల పంటలు

*యాసంగి సీజన్‌లో రైతుల పరిస్థితి 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డ' చందంగా మారింది. ఓవైపు సాగునీరు లేక పంటలను కాపాడుకునేందుకు అరిగోస పడుతుంటే.. మరోవైపు అకాల వర్షం నిండా ముంచింది. గురువారం రాత్రి దంచికొట్టగా, చేతికొచ్చిన పంటలు నేలకొరిగాయి. జొన్న, మక్క, నువ్వు పంటలకు పెద్ద ఎత్తున దెబ్బ తిన్నాయి. కండ్ల ముందే నష్టం వాటిల్లడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.*



తాంసి : పొన్నారిలో వర్షానికి తడిసిన జొన్నలను ఆరబెడుతున్న రైతులు



నేరడిగొండ మండలం కుప్టిలో దెబ్బ తిన్న జొన్న పంట

ఆదిలాబాద్, ఏప్రిల్ 4 ( నమస్తే తెలంగాణ)/నేరడిగొండ/తాంసి, ఏప్రిల్ 4 : ఆదిలాబాద్ జిల్లాలో గురువారం సాయంత్రం ఈదరుగాలులతో కూడిన వానతో నేరడిగొండ, తాంసి, తదితర మండలాల్లో చేతికందిన జొన్న, మక్క, నువ్వు పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో ఎక్కువగా జొన్న పంటను సాగు చేశారు. పంట కోతల సమయంలో కురిసిన అకాల వర్షంతో జొన్న నేలకొరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు పంటనష్టం అంచనాలు తయారు చేస్తున్నారు. యాసంగిలో ఎంతో కష్టపడి సాగుచేసిన జొన్న పంట అకాల వర్షాల కారణంగా నష్టపోవాల్సి వచ్చిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### నేరడిగొండలో జొన్న పంటకు నష్టం

నేరడిగొండ మండలంలోని కుప్టి, కుమారి, వడూర్, వాంకిడి, రాజురా, ఈస్పూర్, గౌలిగూడ, నారాయణపూర్, బోరిగాం,తర్నం, వాగ్దారి, తదితర గ్రామాల్లో జొన్న, మక్క, నువ్వు తదితర పంటలు సాగుచేశారు. గురువారం రాత్రి కురిసిన వానతో కుప్టి గ్రామానికి చెందిన బాదం వెంకటరమణ, గణేశ్, కుమారి గ్రామానికి చెందిన రాంలక్ష్మణ్ అనే రైతుల పంటలు పూర్తిగా నేలకొరిగి దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి పంట నష్టానికి పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

### తాంసిలో కల్లాల్లో తడిసిన ధాన్యం

తాంసి మండలంలోని పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా జొన్న, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంట కోతల తర్వాత కల్లాల్లో ఆరబోయగా అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. ప్రభుత్వం పంట నష్టం పరిశీలించి తగిన నష్టపరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

# జిల్లాలో త్వరలో 'పోలీసు మీ కోసం'

**ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, ఏప్రిల్ 4: ఆదిలాబాద్ జిల్లాలో త్వరలో 'పోలీసు మీ కోసం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రతివారం ఒక్కో గ్రామంలో నిర్వహిస్తామని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉట్నూర్ సబ్ డివిజనల్ పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పెండింగ్ కేసులపై ఆరా తీశారు. కేసుల్లో నిజాయితీగా బాధితులకు న్యాయం చేకూరే విధంగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టులలో చార్జి షీటు దాఖలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేసి నివేదిక సమర్పించాలని తెలిపారు. నూతన సైబర్ క్రైమ్‌లపై, నూతన చట్టాలపై, అసాంఘిక కార్యకలాపాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. దాబాల్లో అసాంఘిక కార్యకలాపాల నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హైవేలపై ప్రమాదాల నివారణకు కృషి చేయలన్నారు. గంజాయి సాగు, స్మగ్లింగ్, వినియోగించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కోర్టు డ్యూటీ అధికారి విధులను పర్యవేక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న కేసుల్లో సాక్షులను హాజరు పరిచి, నేరస్తులకు శిక్షలు పడే విధంగా కృషిచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వీడీసీలు ఎలాంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు (బెల్ట్ షాపులు, కల్లు దుకాణాలు) అనుమతులివ్వకుండా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా, అక్రమ వసూళ్లకు పాల్పడకుండా చూడాలన్నారు. పట్టణంలో ప్రత్యేకంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వేలిముద్రలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్, డీఎస్పీలు సీహెచ్ నాగేందర్, పోతారం శ్రీనివాస్, సీఐలు భీమేశ్, మొగిలి,రహీం పాషా,పాండే రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

నార్నూర్, ఏప్రిల్ 4: తాగునీటి సమస్య పరిష్కారించాలంటూ నార్నూర్ మండల కేంద్రంలోని విజయ్ నగర్ కాలనీ మహిళలు, స్థానికులు శుక్రవారం ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ..తాగునీటి కోసం వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మిషన్ భగీరథ నీరు కూడా సరఫరా కావడం లేదని తెలిపారు. గంటపాటు రోడ్డుపై నిరసన తెలుపడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేశ్ అక్కడికి వెళ్లి వారితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. సంబంధితశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.



నార్నూర్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న విజయ్‌నగర్ కాలనీ మహిళలు

# భూ వివాదాలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్,4: అటవీ, రెవెన్యూ భూ వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, రెవెన్యూ భూ వివాదాల పరిష్కారంపై అధికారులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఎకరం విలువైనదేనని, అటవీ, రెవెన్యూ భూముల హద్దులను తక్షణమే గుర్తించి రెగ్యులర్ సర్వేలు నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి నాగిని భాను, ఆర్డీవో రత్నకల్యాణి, ఆర్అండ్‌బీ ఈఈ అశోక్‌కుమార్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

### పకడ్బందీగా పంపిణీ చేయాలి

సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి జిల్లాల కలెక్టర్లతో సన్న బియ్యం పంపిణీ పై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నిర్మల్ నుంచి కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఎం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, ఏప్రిల్ 4 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూగర్భజలాల రీచార్జ్ కార్యాచరణ ప్రణాళికపై శుక్రవారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ప్రాజెక్ట్‌లో పనులను వేగవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం బేస్‌మెంట్ ఏరియా 400 ఎస్ఎఫ్‌టీ కంటే ఎక్కువ గాని, తక్కువ గాని, ఉండకూడదని, సిమెంట్ ఇటుకలతోనే గోడలు నిర్మించుకోవాలని, లోకల్ ఇటుకలు వాడకూడదని అన్నారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. నిరుపేద లబ్ధిదారులకు ఎస్‌హెచ్‌జీ గ్రూప్ ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు డీఆర్డీవో చర్యలు చేపట్టాలని తెలిపారు. మండలాల వారీగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఎంపీడీవో ఆధ్వర్యంలో ఈ నెలాఖరు వరకు 20 నుంచి 30 బేస్‌మెంట్‌లు నిర్మించాలని, ఏఈలు ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. బేస్‌మెంట్ లెవెల్ పూర్తయిన ఇండ్ల వివరాలు హౌసింగ్ విభాగానికి పంపితే రూ.లక్ష చొప్పున లబ్ధిదారులకు చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. ఇంకా ప్రారంభం కానీ చోట త్వరగా ప్రారంభించాలని, మేస్త్రీలను ఒక్కో మండలం నుంచి కొంత మందిని తీసుకొని వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. మోడల్ విలేజ్ నిర్మాణ పనులు జూన్ 30లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

### దరఖాస్తు చేసేందుకు రేషన్‌కార్డు ఉంటే చాలు

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసేందుకు రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉంటే సరిపోతుందని, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దరఖాస్తు గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు వివరించారు. మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయంలో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, సీఈవో, డీపీవో, బ్యాంక్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

**ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 4 : ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాలున్న భోజనాన్ని అందించాలని అధికారులు, సిబ్బందిని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా ఆదేశించారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలోని బాలికల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుడ్లతోపాటు సరుకులు, పోషకాల ఆహారాన్ని పరిశీలించి, వంటగది, స్టోర్ రూం, తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందించాలన్నారు. అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులె వరైనా జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారా ? లేదా ? అని ఆరాతీశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాలతో పాటు పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



గుడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా